ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 85
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
ఆదివారం, 08-10-2023

విలేకర్లు కావలెను
జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me



2 లో

# ఇక మహిళా లోకానికి మంచిరోజులు

ఓబీసీ మహిళలకు కోటా కోసం పోరాటం కొనసాగుతుంది.. మహిళా బిల్లుకు కృషి చేసిన దేవే గౌడ, సోనియా, మోడీకి కృతజ్ఞతలు.. ప్రపంచవ్యాప్తంగా మహిళల ఆరోగ్యంపై కూడా పట్టింపులేదు.. లండన్ లో బ్రిడ్జ్ ఇండియా సమావేశంలో కల్వకుంట్ల కవిత.. కల్వకుంట్ల కవితకు ప్రశంసల వెల్లువ...

## ఎర్రకోట ప్రసంగంపై రివ్యూ



జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 7

ఎర్రకోట నుంచి చేసిన ప్రకటనలను నెరవేర్చడంలో ప్రధాని బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎర్రకోట ప్రసంగంలో చేసిన ప్రకటనలను సమీక్షించేందుకు ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో, పేద, మధ్యతరగతి ప్రజల గృహాల కోసం సరసమైన రుణాలు, గృహాలకు సౌరశక్తిని భరోసా ఇవ్వడానికి ప్రధాని మోడీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే.ఎర్రకోట ప్రాకారాల నుండి తన ప్రసంగంలో ప్రధాని మోదీ పేద మరియు మధ్యతరగతి ప్రజలకు గృహాల కోసం సరసమైన రుణాలను అమలు చేయడం గురించి మాట్లాడారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఇది కాకుండా, గృహాలకు సౌరశక్తిని నిర్ధారించాల్సిన అవసరాన్ని కూడా ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పథకాల అమలుకు సంబంధించిన సన్నాహాలను ప్రధాని సమీక్షించారని ఆ ప్రకటన తెలిపింది. ఈ సమావేశానికి ప్రధాని మోడీ ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, కేబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా, తదితరులు హాజరయ్యారు.

## ఆసియా క్రీడల్లో దుమ్మురేపిన భారత్



జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 7

సియా క్రీడల్లో భారత ఆటగాళ్లు సరికొత్త చరిత్ర లిఖించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎడిషన్ లో 100 పతకాల మార్కు దాటారు. నేటి ఉదయం సైతం పలు విభాగాలలో భారత్ కు స్వర్ణాలు దక్కగా, తాజాగా బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఏషియన్ గేమ్స్ చరిత్రలో తొలిసారిగా స్వర్ణ పతకం భారత్ కైవసం చేసుకుంది. డబుల్స్ ఫైనల్లో తెలుగు తేజం సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట కొరియా ఆటగాళ్లు చో సోల్గూ, కిమ్ వోంగూ పై 2118, 2116 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించారు. ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్ మిగతా 2 లో


## కలిసే ముందుకు వెళ్దాం



జయభేరి, విజయవాడ, అక్టోబరు 7

టీడీపీతో కలిసి వెళ్తామని ఎవ్వరూ ఊహించని టైంలో ప్రకటించారు పవన్ కల్యాణ్. సడెన్‌గా చేసిన ఈ ప్రకటనపై మిత్రపక్షం బీజేపీతో పాటు ఏపీ రాజకీయ వర్గాల్లో కూడా ఆశ్చర్యం వ్యక్తమైంది. ఈ ప్రకటనైతే వస్తుంది కానీ.. కొంచెం ఆలస్యం అవుతుందని భావించారు అంతా. కానీ ఇంత సడెన్‌గా.. అదీ.. చంద్రబాబు జైల్లో ఉండగా వస్తుందని ఎవ్వరూ అంచనా వేయలేదు. వాళ్లూ వీళ్లూ షాకైతే ఫర్వాలేదు. చేయాల్సిన కామెంట్లు చేస్తారు.. విమర్శిస్తారు. పార్టీ కేడర్‌కే ఆ పరిస్థితి ఎదురైతే ఎలా? వాళ్ళ నమ్మకం సడలితే ఎలాగన్నది ఇప్పుడు బిగ్ క్వశ్చన్. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు.. పవన్ కామెంట్లను కనుక విశ్లేషిస్తే.. ఆయన ప్రకటనను ఆ పార్టీ కార్యకర్తలు.. పవన్ అభిమానులే జీర్ణించుకోలేకపోతున్నారా..? అనే చర్చ జరుగుతోంది. ఈ ఫీడ్ బ్యాక్ ఉండబట్టే... ఆయన లైన్, మాట తీరు కూడా మారిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించిన తర్వాత నుంచి పవన్ మాట తీరులో స్పష్టంగా మార్పు కన్పించింది. అర్థం చేసుకోండి..సర్దుకుపోండి..కలహాలు వద్దు..ఎగ్రెసివ్‌గా వెళ్లొద్దు..గొడవలు పడొద్దు.. గతం గతః అనే రీతిలో ఉన్నాయి ఆయన మాటలు.పార్టీ విస్తృత స్థాయి సమావేశంలోనూ.. ఆ తర్వాత జరిగిన అవనిగడ్డ బహిరంగ సభలోనూ ఇదే తరహాలో మాట్లాడారాయన. పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ నాగబాబు చేస్తున్న కామెంట్సే ఇందుకు నిదర్శనమంటున్నారు. వరస చూస్తుంటే.. పవన్ ఓవైపు.. నాగబాబు మరోవైపు.. నాదెండ్ల మనోహర్ ఇంకో వైపు ఉండి పార్టీ కేడర్‌ను.. లీడర్లను పొత్తుకు అంగీకరింప చేసే విధంగా ఒత్తిడి తీసుకురావడమో.. ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తుండడమోలాంటివి కనిపిస్తున్నాయన్నది రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. దీంతో అసలుకే మోసం వస్తుందని, పొత్తు పండదేమోననే ఆందోళనతో పవన్ అండ్ టీమ్.. ప్లీజింగ్ జానర్‌ను ఎంచుకున్నారనేది ఏపీ పొలిటికల్ సర్కిల్సులో వినిపిస్తున్న మాట. ప్రస్తుత పరిణామంతో అవునన్నా.. కాదన్నా.. పవన్ టీడీపీకి పెద్ద దిక్కుగా మారడంతో పాటు.. ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో ఓ విధంగా చెప్పాలంటే కింగ్ మేకర్ పాత్ర పోషించే పరిస్థితికి ఎన్నికలకు ముందే చేరుకున్నారనేది జనసేన వర్గాల్లో కొందరి అభిప్రాయం. తమ అధినేత సడెన్‌గా నిర్ణయాన్ని ప్రకటించడం వల్లనే కేడర్‌ను కన్విన్స్ చేసుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. లీడర్లే కాదు.. గతంలో తాను కూడా చంద్రబాబుతో విబేధించాననే విషయాన్ని వివరించడం ద్వారా.. రాష్ట్రం కోసం.. పార్టీ కోసం వ్యూహాత్మకంగా ఏ విధంగా సర్దుకుపోవాలో చెప్పి కన్విన్స్ చేస్తున్నారని అంటున్నాయి పార్టీ వర్గాలు. ఆయన సర్దుకుపోయినట్టు కేడర్.. లీడర్లు సర్దుకుపోతారా..? సర్దేసుకుంటారా..? అనేది చూడాలన్న చర్చ కూడా మొదలైంది. ముందు ముందు గ్లాస్ పార్టీలో పరిణామాలు ఎలా మారతాయో చూడాలి.

## పండుగ సీజన్‌లో ద్రవ్యోల్బణం దెబ్బ



జయభేరి, ముంబై, అక్టోబరు 7

ఈ నెల 04, 06 తేదీల్లో, మూడు రోజుల పాటు చర్చలు జరిపిన తర్వాత, రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకూడదని RBI మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్‌లో నిర్ణయించారు. ఇదే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు.కీలక రేట్లు పెరగలేదు అనే విషయం పైకి కనిపిస్తున్నా, గరిష్ట స్థాయికి చేరిన వడ్డీ రేట్లను ఆర్‌బీఐ మిగతా 2 లో



## కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో తులం బంగారం

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 7

వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే సంచలన పథకాలను ప్రకటించింది. సోనియా గాంధీ ద్వారా ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. అయితే అవి పూర్తి స్థాయి మేనిఫెస్టో కాదు. దీనిపై ఇప్పటికీ కసరత్తు చేస్తున్నారు. ఈ మేనిఫెస్టోలో మరిన్ని సంచలన విషయాలు.. పథకాలు ఉండేలా చూసుకుంటున్నారు. అందులో భాగంగా పేద కుటుంబాల్లో పెళ్లి జరిగితే ముఖ్యంగా అమ్మాయి పెళ్లికి తులం బంగారం ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది సంచలనాత్మక పథకం అవుతుందని భావిస్తున్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజల్లోకి వెళ్తున్న తెలంగాణ కాంగ్రెస్.. మరో సంచలన హామీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు స్కీం కింద రైతులకు ఎకరాకు ఏటా పదివేలు అందిస్తుండగా.. తాము అధికారంలోకి మిగతా 2 లో



నన్ను ఆశీర్వదించండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా..!

3 లో

## రేసులోకి వచ్చేది ఎలా..

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 7

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఏదో ఉంటే ఈ కార్యక్రమాలన్నీ ఎందుకని బీజేపీ ముఖ్య నేత బీఎల్ సంతోష్ పదాధికారుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రచారం విస్తృతంగా జరుగుతూండటం.. ప్రజల్లోనూ అదే అభిప్రాయం ఉండటమే. అయితే ఇటీవల ఆ అభిప్రాయాన్ని మార్చడానికి ప్రధాని మోదీ తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. కేసీఆర్ పై విమర్శలు చేశారు. తెలంగాణకు వరాలు ప్రకటించారు మరి ఇప్పుడైనా తెలంగాణలో మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆసియా క్రీడల్లో దుమ్మురేపిన భారత్

విభాగంలో భారత్ నెగ్గిన తొలి స్వర్ణం ఇది.అంతకుముందు ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఫైనల్ చేరిన తొలి జంటగా సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి జంట నిలచింది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న సాత్విక్ చిరాగ్ జంట శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 2117, 2112 తేడాతో మలేషియాకు చెందిన ఆరోన్ చీసోహ్ యిూక్ పై ఘనవిజయం సాధించారు. ఇప్పటికే పురుషుల సింగిల్స్‌లో 41 ఏళ్ల తర్వాత హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి కాంస్య పతకం నెగ్గాడు. బ్యాడ్మింటన్ డబుల్స్ లో సాత్విక్, చిరాగ్ శెట్టి వరల్డ్ నెంబర్ 2లో కొనసాగుతున్నారు. చైనాలోని హాంగ్జౌలో జరుగుతన్న 19వ ఏషియన్ గేమ్స్ లో వీరు సాధించిన స్వర్ణంతో భారత్ ఖాతాలో 101వ పతకం చేరింది. భారత్ స్వర్ణాల సంఖ్య 26కాగా, కబడ్డీ, క్రికెట్ విభాగాల్లోనూ భారత ఆటగాళ్లు గోల్డ్ సాధించారు. శనివారం జరిగిన ఫైనల్స్ లో విజేతలుగా నిలిచి త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. 19వ ఏషియన్ గేమ్స్ లో భారత్ 104 పతకాలు సాధించగా.. అందులో 28 స్వర్ణాలు, 35 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి. ఈ ఎడిషన్ కు ముందు వరకు భారత్ అత్యుత్తమం 70 పతకాలు అని తెలిసిందే.తెలుగు తేజం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ 58 ఏళ్లలో భారత్ కు తొలి స్వర్ణ పతకం అందించారు. ఆసియా గేమ్స్ బ్యాడ్మింటన్ లో 1965లో దినేశ్ ఖన్నా పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు స్వర్ణం తెచ్చాడు. 1971లో దీపు ఘోష్, రామన్ ఘోష్ జంట డబుల్స్ లో కాంస్య పతకం సాధించారు.

**3 స్వర్ణాలు నెగ్గిన జ్యోతి సురేఖ**

భారత స్టార్, తెలుగమ్మాయి జ్యోతి సురేఖ భారత్‌కు మరో పసిడి పతకాన్ని అందించి సత్తా చాటింది. ముచ్చటగా మూడో స్వర్ణం సాధించి భారత కీర్తి పతాకను చైనా గగన తలంపై రెపరెపలాడించింది. ఇప్పటికే ఆర్చరీ కాంపౌండ్ వుమెన్స్ టీమ్ విభాగంలో స్వర్ణం గెలిచిన జ్యోతిసురేఖ... ఆర్చరీ కాంపౌండ్ మిక్స్‌డ్ విభాగంలోనూ పసిడి పతకం అందుకుంది. తాజాగా ఆర్చరీ మహిళల వ్యక్తిగత విభాగం ఫైనల్లో 149 145తో విజయం సాధించి స్వర్ణాన్ని ముద్దాడింది. ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన సో చెవాన్‌పై జ్యోతిసురేఖ అద్భుత ఆటతీరుతో గెలుపొందింది

## పండుగ సీజన్‌లో ద్రవ్యోల్బణం దెబ్బ

తగ్గించలేదు అన్నదాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఈ ఎఫెక్ట్ బ్యాంక్ లోన్లు తీసుకున్న వాళ్ల మీద, తీసుకోబోయే వాళ్ల మీద ఉంటుంది. అధిక వడ్డీ రేట్ల కారణంగా, సామాన్య జనం మరికొంత కాలం పాటు అధిక EMIలు చెల్లిస్తూనే ఉండాలి, రిలీఫ్ దొరలేదు. మరోవైపు, దేశంలో ద్రవ్యోల్బణం ఇప్పట్లో తగ్గుతుందన్న ఆశ కూడా కనిపించడం లేదు. ముఖ్యంగా, ఈ పండుగల సీజన్‌లో ఆహార ద్రవ్యోల్బణం నుంచి ఉపశమనం లభించే అవకాశం లేదు. ఈ నెలలో దసరా ఉంది, 10 రోజుల పాటు నవరాత్రులు జరుగుతాయి. దీపావళి వస్తుంది. మన దేశంలో అతి పెద్ద పండుగలు ఇవి. ఇంట్లో పిండి వంటలు చేసుకోవాలంటే బడ్జెట్ వేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జులైలో 15 నెలల గరిష్ఠ స్థాయి 7.44 శాతంలో ఉంది. ఆగస్టులో కాస్త శాంతించి 6.83 శాతానికి తగ్గింది. అయితే, అది ఇప్పటికీ సెంట్రల్ బ్యాంక్ కంఫర్ట్ జోన్ (2%6%) కంటే ఎక్కువగానే ఉంది. రుతుపవన వర్షాలు దేశవ్యాప్తంగా సమానంగా కురవలేదు. ఉత్తరాదిలో కురిసిన వానను ఊళ్లను ముంచెత్తితే, దక్షిణాదిలో చినుకు రాలడం గగనమైంది. ఈ అసమాన, అనూహ్య వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయలు, పాలు, పప్పులు, ధాన్యాల వంటి నిత్యావసర వస్తువుల ఉత్పత్తికి బ్రేక్ పడింది. దీనివల్ల ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఆహార పదార్థాల ధరలు సామాన్యుడి నెత్తి మీదకెక్కి తైతక్కలాడుతున్నాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202324లోనూ ద్రవ్యోల్బణం తగ్గదని ఆర్‌బీఐ అంచనా వేసింది. వచ్చే ఏడాది మార్చి వరకు ద్రవ్యోల్బణం సగటున 5.40 శాతంగా ఉంటుందని లెక్క కట్టింది. రెండో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం రేటు 6.40 శాతంగా, మూడో త్రైమాసికంలో 5.60 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 5.20 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (202425) తొలి త్రైమాసికంలో 5.20 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని చెబుతోంది.అంటే, దేశంలో ధరలు ఇప్పట్లో తగ్గే ఛాన్స్ లేదని ఆర్‌బీఐ కూడా అంగీకరించింది. కరోనా మహమ్మారి తర్వాత, ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడానికి రెపోరేటును 4 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. చాలా కాలం పాటు 4 శాతం వద్దే ఉంచిన కేంద్ర బ్యాంక్, పెరిగిన ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు రెపో రేటును పలుమార్లు పెంచింది. 2022 మే నుంచి రెపో రేటు పెరగడం ప్రారంభమైంది, 2023 ఫిబ్రవరి వరకు ఈ సైకిల్ కొనసాగింది. ఈ కాలంలో రెపో రేటు 250 బేసిస్ పాయింట్లు లేదా 2.50 శాతం పెరిగింది. గత ఎనిమిది నెలలుగా రెపో రేటులో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం రెపో రేటు 6.50 శాతంగా ఉంది.

## రేసులోకి వచ్చేది ఎలా..

బీఆర్ఎస్‌కు బీజేపీ ప్రత్యర్థి అని ప్రజలు నమ్ముతారా? బండి సంజయ్ తెలంగాణ బీజేపీ చీఫ్ గా ఉన్నప్పుడు బీజేపీ దూకుడుగా ఉంది. కాంగ్రెస్ పూర్తిగా వెనుకబడిపోయింది. బండి సంజయ్ దూకుడుపై విమర్శలు వస్తే వచ్చి ఉండవచ్చు కానీ బీఆర్ఎస్ ను ఎదుర్కోవాలంటే ఆయనే కరెక్ట్ అన్న అభిప్రాయానికి వచ్చారు. అదే సమయంలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ తెరపైకి వచ్చింది. కవిత అరెస్టు ఖాయమనుకున్నారు. బండి సంజయ్ అంతకు ముందు నుంచీ అరెస్టుల గురించి చెబుతున్నారు. అరెస్టు జరిగి ఉంటే.. బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అన్నది పూర్తి స్థాయిలో సాక్షాత్కరించేది. కానీ ఒక్క సారిగా బీజేపీ హైకమాండ్ బ్యాక్ ఫుట్ తీసుకుంది. బండి సంజయ్ ను పదవి నుంచి తప్పించింది. కవిత కూడా అరెస్టు కాలేదు. అదే సమయంలో కేసీఆర్ బీజేపీని విమర్శించడం మానుకున్నారు. ఈ పరిణామం వల్ల బీజేపీ తీవ్రంగా నష్టపోయింది. రెండు పార్టీలు ఒక్కటేనని ప్రజలు గట్టిగా నమ్మడం ప్రారంభించారు. ఈ మాటలు సహజంగానే కలకలం రేపాయి. ఆ తర్వాత తెలంగాణకు పసుపుబోర్డు ప్రకటించారు. గిరిజన యూనివర్శిటీని మంజూరు చేశారు. కేసీఆర్ చాలా కాలంగా బీజేపీని ఇరుకున పెడుతున్న కృష్ణా ట్రైబ్యూనల్ అంశాన్నీ పరిష్కరించారు. కేబినెట్ లో నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికలకు వెళ్లే ముందు తీసుకున్న ఈ నిర్ణయాలు తెలంగాణ ప్రజలకు ఎంతమేర నమ్మకం కలిగిస్తాయో.. కేసీఆర్ పై చేసిన విమర్శలు కూడా అంత మేరే ప్లస్ అవుతాయి. రెండు పార్టీల మధ్య ఏమీ లేదని నమ్మడనికి ఈ రెండు పరిణామాలు సరిపోతాయా అంటే.. రాజకీయవర్గాలు మాత్రం చాలా కష్టం అన్న వాదన వినిపిస్తున్నాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అంచనా వేస్తే తెలంగాణలో ముఖాముఖిపోరు ఉందని అర్థమైపోతుంది. కానీ బీజేపీ మాత్రం ఆశలు వదులుకోలేదు. తాము కూడా రేసులో ఉన్నామని చెబుతోంది. కానీ ఆ పార్టీలో టిక్కెట్ల కోసం అడిగేవారు లేరు. ఉన్నవారు కూడా జంప్ అవుతారన్న ప్రచారం ఉద్ధృతంగా సాగుతోంది. ఎందుకంటే ప్రజల్లో.. నరేంద్రమోదీ మాటలు, ప్రకటనలు.. వరాలు కూడా అంత బాగా నమ్మకం కలిగించలేకపోతున్నాయి. ఇంకా రేసులోకి రావాలంటే.. ఈ మాత్రం సరిపోదని.. ఇంకా ఇంకా చాలా చేయాల్సి ఉందన్న వాదన మాత్రం గట్టిగానే వినిపిస్తోంది.

## మ్యానిఫెస్టోలో తులం బంగారం

వస్తే ఎకరాకు రూ.15 వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కౌలు రైతులకు సైతం రైతు బంధు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న హస్తం పార్టీ.. అన్ని వర్గాలను ఆకర్షించేలా మేనిఫెస్టో రూపొందించాలని ప్లాన్ చేసింది. మహిళలు, రైతులు, విద్యార్థులు, పేదలు ఇలా అన్ని వర్గాలను ఆకట్టుకునే హామీలపై కసరత్తు చేస్తోంది. ఇందుకోసం మాజీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో మేనిఫెస్టో కమిటీని కూడా ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఉచిత మెట్రో ప్రయాణం, ఫ్రీ వైఫై లాంటి పథకాలపైనా ఆలోచనలు చేస్తోంది.బీఆర్ఎస్ అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ పథకానికి మరో పేరు పెట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మీ స్థానంలో పసుపు - కుంకుమ అనే పథకం తీసుకురావాలని మేనిఫెస్టో కమిటీకి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈ పథకం కింద పెళ్లి కూతురుకు రూ. లక్ష నగదుతో పాటు తులం బంగారం అందించాలని జీవన్ రెడ్డి ప్రతిపాదించినట్లు సమాచారం. పెళ్లి అంటే ఎక్కువ ఖర్చు బంగారం కోసమే ఉంటుంది కాబట్టి.. తులం ఇస్తే.. మహిళల్లో అనూహ్యమైన స్పందన ఉంటుందని అంచనా వేస్తున్నారు. తెలంగాణలో ఈ సారి ఎన్నికల పోరులో మేనిఫెస్టోలు ఉచిత పథకాలతో హోరెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పథకాలకు కౌంటర్ ఇచ్చేందుకు కేసీఆర్ ప్రత్యేకమైన కసరత్తు జరుపుతున్నారు. అన్ని వర్గాలకు ఎంతో కొంత మేలు జరిగేలా చూస్తే ఓట్ల వర్షం కురుస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందు కోసం మేధోమథనం జరుపుతున్నారు. ఈ నెలలోనే మేనిఫెస్టోలతో తెలంగాణ ఓటర్లపై ఉచిత పథకాల వరద కురవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఇక మహిళా లోకానికి మంచిరోజులు

**జయభేరి, లండన్ :**

భారత దేశంలో మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చిన నేపథ్యంలో భవిష్యత్తులో మహిళలకు మంచి రోజులు వస్తాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. చట్టసభల్లోకి మరింత మంది మహిళలు ప్రవేశించడానికి మార్గం చూపే విప్లవాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును భారత్ ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుతం భారత పార్లమెంటులో 78 మంది మహిళా ఎంపీలుగా ఉన్నారని, మహిళా రిజర్వేషన్లతో ఆ సంఖ్య 181కు చేరుతుందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటుకు తీసుకురావడంలో 1996లో దేవే గౌడ ప్రభుత్వం, 2010లో సోనియా గాంధీ, 2023లో ప్రధాని నరేంద్ర మోడీ కీలకంగా వ్యవహరించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు.

లండన్ లోని పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా "మహిళా రిజర్వేషన్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం" అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేశారు. ఆమె మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంలో తెలంగాణ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళా బిల్లును పార్లమెంటు ఆమోదించాలని తీర్మానం చేయించి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. ఆ తర్వాత అనేక సందర్భాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తారని, ప్రధాన మంత్రికి కూడా సీఎం కేసీఆర్ లేఖ రాశారని వివరించారు. అయితే, మహిళా రిజర్వేషన్లో ఓబీసీ మహిళలకు కోటా లేకపోవడం ఆందోళకరమని, ఓబీసీ మహిళలకు న్యాయం చేయడం కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ సగం జనాభాను ఇంటికి పరిమితం చేస్తే దేశానికి మంచింది కాదని అభిప్రాయపడ్డారు. దీన్ని గమనించిన అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు మహిళా బిల్లుకు సానుకూలత వ్యక్తం చేశారని, తద్వారా మహిళా రిజర్వేషన్ సాకారమయ్యిందని పేర్కొన్నారు. 1950లో రాజ్యాంగ చర్చలు జరుగుతున్న సందర్భంలో తాము కూడా పురుషులతో సమానంగా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నందున రాజకీయ రంగంలో తాము రాణిస్తామని, కాబట్టి మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు అవసరం లేదని సరోజినీ నాయుడు వంటి వారు వాదించారని గర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడంపై చర్చ జరిపి రాజ్యాంగంలో పొందుపర్చారని, కానీ మహిళా నాయకులు మహిళా రిజర్వేషన్లను నిరాకరించారని చెప్పారు. అయితే, తమకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించడం లేదని 1970ల్లో మహిళలు గ్రహించారని, దాంతో మహిళలకు రిజర్వేషన్లపై చర్చ మొదలైందని అన్నారు. 1972లో భారత దేశంలో మహిళల పరిస్థితి అనే అంశాన్ని ఐక్యరాజ్య సమితి ఇతివృత్తంగా తీసుకుందని, ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం మహిళల పరిస్థితిపై విస్తృతంగా సర్వే నిర్వహించి మహిళా అంశాలపై దృష్టిసారించడం లేదని తేల్చిందని వివరించారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో మొదటగా గీతా ముఖర్జీ, సీపీఎం, సీపీఎం పార్టీలు, ఐద్వ సంస్థ కీలక పాత్ర పోషించాయన్నారు. మహిళా బిల్లు కోసం 1990ల్లోనే తన నియోజకవర్గం నిజామాబాద్ లోనే కాకుండా అనేక ప్రాంతాల్లో ధర్నాలు జరిగినా అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. 1996లో దేవే గౌడ ప్రభుత్వం నుంచి మహిళా బిల్లు కోసం ప్రయత్నాలు జరిగి చివరికి ఇటీవల పార్లమెంటు బిల్లును ఆమోదించిందన్నారు. భవిష్యత్తులో మహిళలకు మంచిరోజులు వస్తాయని ఆకాంక్షించారు. అడగకుండానే బీఆర్ అంబేద్కర్, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ వంటి నాయకులు మహిళలకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. యూకే, అమెరికా, జపాన్ వంటి దేశాల్లో మహిళలకు ఓటు హక్కు కోసం దశాబ్దాల పాటు పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. ఒకటి రెండు మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇప్పటికే అమలవుతున్నాయని, స్థానిక పరిపాలనలో మహిళల భాగస్వామ్యం దాదాపు 57 శాతానికి పెరిగిందని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పదవుల్లో దాదాపు 5557 శాతం మంది మహిళలే ఉండడం సంతోషంగా ఉందని చెప్పారు. వారిలో 92 శాతం మంది తమ పార్టీకి చెందినవారేనని అన్నారు. మానవ సమాజంలో పురుషుల ఆధిపత్యం ఎందుకు పెరిగింది ? ఎందుకు మహిళలను అణచివేయాలన్న ఆలోచనలు వచ్చాయి ? కేవలం మానువుల్లోనే ఎందుకు ఇలా జరిగింది ? సహచర మనిషిని ఎలా అణగదొక్కుతారు ? ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మహిళల నుంచి ఎన్నో ఎలా ఆశిస్తారు ? వంటి సీరియస్ ప్రశ్నల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమస్య లోతుల్లోకి వెళ్లి పరిష్కారాలు కనుక్కోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

లక్షలాది మహిళలకు అవకాశాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో స్థానిక సంస్థల్లో 14 లక్షల మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నా అందులో మెజారిటీ స్వతంత్రంగా వ్యహరించే పరిస్థితి లేదని తెలిపారు. కాబట్టి ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించి సరిదిద్దాలన్నారు. అలాగే, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ తో కూడా మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇక మహిళల ఆరోగ్యంపై పరిశోధనా నివేదికలు, పుస్తకాలు కూడా పెద్దగా లేకపోవడాన్ని కూడా కవిత ప్రస్తావించారు. వైద్య పరిశోధనల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసేది కేవలం పురుషుల ఆరోగ్యంపై పరిశోధన చేయడానికేనా అని ప్రశ్నించారు. మహిళల ఆరోగ్యం ఎందుకు ముఖ్యం కాదని అడిగారు. మహిళల అంశాలను, అవసరాలను విస్మరించడం సరికాదని సూచించారు. స్టార్టప్ విషయంలోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. 10 స్టార్టప్ కంపెనీలు ఏర్పడితే మహిళా నేతత్వంలో కేవలం ఒకటి లేదా రెండు మాత్రమే ఉంటున్నాయని తెలిపారు. మహిళల నేతృత్వంలోని స్టార్టప్ లకు ఆర్థిక సాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితికి రాజకీయవేత్తలు అందరూ దోషులేనని చెప్పారు. సరిహద్దులు మరిచి ప్రపంచవ్యాప్తంగా మహిళా అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లు లేని దేశాల మహిళలకు సాయం చేయడం భారత మహిళలు విధిగా భావించాలని అన్నారు. ఇలాంటి బంధం లేకపోతే ప్రగతి సాధించలేమన్నారు. వేల సంవత్సరాల నుంచి మహిళలను విస్మరిస్తూ వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.



**కవితకు ప్రశంసల వెల్లువ**

దేశ చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను సాధించడంలో కీలక పాత్ర పోషించిన కల్వకుంట్ల కవితకు లండన్ లో ప్రశంసలు వెల్లువెత్తాయి. చట్టసభల్లో అత్యల్పంగా ఉన్న మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కవిత కృషి చేశారని వక్తలు కొనియాడారు. మహిళల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భారత దేశ రాజధానిలో ఒక రోజు దీక్ష చేయడమే కాకుండా ప్రజల్లో ఈ అంశంపై చర్చ రేకెత్తడానికి రౌండ్ టేబుల్ సమావేశాన్ని సైతం నిర్వహించారన్న విషయాన్ని గుర్తు చేశారు. దేశ పార్లమెంటులో 1950ల్లో 5 శాతం ఉన్న మహిళల ప్రాతినిధ్యం ప్రస్తుతం కేవలం 15 శాతానికి మాత్రమే పెరిగిందని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లు సాధించడం పెద్ద విజయమని, అది సాధించడానికి కవిత కృషి గణనీయమని స్పష్టం చేశారు. కవిత వంటి రాజకీయవేత్తల వల్లనే మహిళా రిజర్వేషన్లు సాధ్యమైందని అన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం కోసం కవిత ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

**ఆకట్టుకున్న కవితపై వీడియో ప్రదర్శన**

మహిళా రిజర్వేషన్లపై కల్వకుంట్ల కవిత చేసిన కృషిపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ ప్రదర్శించిన ఒక వీడియో సభికులను ఆకట్టుకుంది. 2014లో మొట్టమొదటి సారిగా కొత్తగా ఏర్పడిన తెలంగాణ నుంచి పార్లమెంటుకు ఎన్నికైక కవిత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో మహిళా సాధికారత కోసం పనిచేశారని ఆ సంస్థ తెలిపింది. తెలంగాణ ఏర్పడిన తొలి అసెంబ్లీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై తీర్మానాన్ని ఆమోదించి కేసీఆర్ చరిత్రను సృష్టించారని వివరించింది. 2014 నుంచి 2019 వరకు ఎంపీగా కల్వకుంట్ల కవిత తరుచూ మహిళా రిజర్వేషన్లపై పార్లమెంటులో లేవనత్తేవారని తెలిపింది. ఆ తర్వాత కాలంలోనూ అనేక సందర్భాల్లో ఆయా వేదికలపై ప్రస్తావిస్తూ ప్రజాబాహుల్యంలోకి ఈ అంశంపై చర్చను సజీవంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించారని స్పష్టం చేసింది.

# మహిళలే మహారాణులు



**జయభేరి, మెదక్, అక్టోబరు 7**

సిద్దిపేట జిల్లాలో మొత్తం 9,25,398 మంది ఓటర్లు ఉండగా, అందులో మహిళల ఓట్లు 4,68,140 ఉన్నాయి.పురుషుల ఓట్లు 4,57,178 మాత్రమే ఉన్నాయి.సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లదే ఆధిపత్యం ఉంది.సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం 2,28,523 ఓట్లు ఉండగా, వారిలో పురుషుల ఓట్లు 1,12, 938 ఉంటే మహిళా ఓటర్లు 1,15,520.. ఇతరులు 69 మంది , ప్రవాస ఓటర్లు ఐదుగురు, సర్వీస్ ఓటర్లు 107 మంది ఉన్నారు.దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 1,94,664 ఓటర్లు ఉన్నారు.వారిలో పురుష ఓటర్లు 95,305 ,మహిళా ఓటర్లు 99,359 , ప్రవాస ఓటర్లు మూడు, సర్వీస్ ఓటర్లు 57 మంది ఉన్నారు.గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం, 2,65, 636 ఓటర్లు ఉన్నారు. వారిలో, పురుషులు 1,31,774 , మహిళలు 1, 33, 855 ఉండగా, ప్రవాసులు ఇద్దరు, సర్వీస్ ఓటర్లు 72 మంది ఉన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,36, 575 ఓటర్లు ఉండగా, పురుషులు 1, 17,165, మహిళలు 1,19, 406, ఇతరులు నలుగురు, ప్రవాసులు 9, సర్వీస్ ఓటర్లు 214 మంది ఉన్నారు.

**మెదక్ జిల్లాలో...**

మెదక్ జిల్లాలో మొత్తం 4,34,275 మంది ఓటర్లు ఉన్నారు . అందులో పురుషులు 2,09, 927, మహిళలు 2,24, 337, ఇతరులు 11, ప్రవాసులు 9, సర్వీస్ ఓటర్లు 124 మంది ఉన్నారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 2, 14,064 ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 1,02,340, మహిళా ఓటర్లు 1,11, 720, ఇతరులు 4 ఉన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,211 ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,07, 584, మహిళలు 1,12,617, ఇతరులు 11మంది ఉన్నారు.సంగారెడ్డి జిల్లాలో పురుష ఓటర్లే అధికం...

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 13,55,958ఓటర్లు ఉన్నారు.అందులో పురుషులు 6,83,076, మహిళలు 6,72,757,ఇతరులు 74,సర్వీసు ఓటర్లు 354మంది ఉన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం 2,27,232మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,14,570 ,మహిళలు 1,12,654, ఇతరులు 8 సర్వీసు ఓటర్లు 67మంది ఉన్నారు.అందోల్ నియోజక వర్గంలో మొత్తం 2,44,710మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,20,572,మహిళలు 1,24,133 ఇతరులు 5, ప్రవాసులు 5,సర్వీసు ఓటర్లు 48మంది ఉన్నారు.జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,64,732 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,33, 312, మహిళా ఓటర్లు 1,31,419 , ప్రవాసులు 3, సర్వీస్ ఓటర్లు 103 మంది ఉన్నారు.సంగారెడ్డి నియోజకవర్గంలో మొత్తం 2,38, 336 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,18,265 , మహిళా ఓటర్లు 1,20,037 , ఇతరులు 34, ప్రవాసులు 10, సర్వీస్ ఓటర్లు 66 మంది ఉన్నారు.పటాన్చెరు నియోజకవర్గంలో మొత్తం 3,80,948 మంది ఓటర్లు ఉన్నారు, అందులో పురుషులు 1,96, 357, మహిళలు 1,84, 504 , ఇతరులు 77, ప్రవాసులు 56, సర్వీస్ ఓటర్లు 70 మంది ఉన్నారు..

# ఎల్బీ నగర్ లో పలు అభివృద్ధి పనులు

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**జయభేరి, రంగారెడ్డి :**

ఎల్బీనగర్ నియోజకవర్గం లో మాన్సూరబాద్ డివిజన్ ఈస్ట్ కాలనీల ఆత్మీయ సమ్మేళనం ఎస్వీ కన్వెన్షన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ యంఎల్ఏ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. పలు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో 974 కాలనీ లు ఉన్నాయి..365 రోజులు అన్ని కాలనీ లకు అందుబాటులో ఉంటున్నానని అన్నారు. ఎన్నో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లు వెశాము..కోత్తగా 4 కోట్లు రూపాయాలతో ట్రాంక్ ల్యాన్ ఎర్పాటు చేశామని అన్నారు. 45 రోజులలో అన్ని కాలనీల్లో డ్రైనేజీ లు, మంచి నిరు సమస్యతో పాటు వర్షం నీరు ఎక్కడ కూడా నిలవకుండా ఎర్పాటు చేశాం. రాష్ట్రంలో ఏ నియోజకవర్గం కూడా పెద్ద నియోజకవర్గం లెదు. మన ఎల్బీనగర్ నియోజకవర్గం ఉంది. రాబోయే కాలంలో అన్ని కాలనీల్లో అన్ని వసతులు పరిష్కారం చేస్తామని అయన అన్నారు.

ఎల్బీనగర్ ను ఎవరు గుర్తు పట్టకుండా అబివృద్ధి పనులు చేశాం. నాగోల్ లోని మురుగు నీళ్ళు శుద్ధి చేస్తామని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో సుమార్ 3000 కోట్లు తో అభివృద్ధి చేశామని అన్నారు. రాబోయే రోజుల్లో ఏ అభివృద్ధి పనులు చేయాలని ప్రణాలిక చేశామని అన్నారు.

# ఫ్రీ బీలపై సుప్రీం సీరియస్

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 7**

ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగనున్న వేళ సుప్రీంకోర్టులో ఒక కీలక పిటిషన్ దాఖలైంది. ఓటర్లకు నగదు, ఉచిత కానుకలు పంచకుండా రాజకీయ పార్టీలను కట్టడి చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల వేళ మరోసారి ఉచితపథకాలపై దేశవ్యాప్తంగా రచ్చ మొదలైంది. ఆదాయం లేక పోయినా అప్పులు చేసి మరీ ప్రభుత్వాలు డబ్బులు పంచుకుంటూ పోతున్నాయని వెంటనే కట్టడి చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే రాష్ట్రాలు అప్పులపాలవుతున్నాయని.. అయినా ఓట్ల కొనేందుకు ట్యాక్స్ పేయర్స్ డబ్బు వాడుకుంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం.. సమాధానం చెప్పాలంటూ రెండు రాష్ట్రాలకు, కేంద్రానికి అటు ఎన్నికల సంఘానికి నోటీసులు ఇచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణలోనూ పార్టీలు హామీలు ఇవ్వడంలో పోటీపడుతున్నాయి. ఉచిత పథకాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నంలో ఉన్నాయి ప్రధానపార్టీలు.ఉచితాలకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. పన్ను చెల్లింపుదారుల ధనాన్ని ఇలా కానుకలుగా పంచడం సబబుకాదని న్యాయస్థానానికి తెలిపారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నగదు, కానుకల పంపిణీ మొదలువుతుందనే విషయాన్ని పిటిషనర్ న్యాయస్థానం దృష్టికి తెచ్చారు.ఎన్నికల సమయంలో ఇచ్చే ఓటర్లకు రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలను తాము నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ DY చంద్రచూడ్, జస్టిస్ JB పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కోరుతూ సుప్రీంకోర్టు - కేంద్రం, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది.రాజస్థాన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులను ప్రతివాదులుగా చేస్తూ ఈ పిటిషన్ దాఖలైంది. కాని, ముఖ్యమంత్రులను తొలగించి ఆ రాష్ట్రాల పేర్లు చేర్చాలని సుప్రీంకోర్టు సూచించిందిఈ తరహా పిటిషన్‌లో గతంలో కూడా సుప్రీంకోర్టులో దాఖలైంది. బీజేపీ నేత అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను గతేడాది ఆగస్టులో సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌కు బదిలీ చేసింది. గతంలో ఉన్న పిటిషన్‌ను ప్రస్తుతం దాఖలైన పిటిషన్‌ను రెండింటిని కలిపి విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది.

# కాంగ్రెస్, బీజేపీ మధ్య ట్వీట్ వార్

**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 7**

పార్టీ ప్రెసిడెంట్ పదవిలో లేకపోయినప్పటికీ..రాహుల్ గాంధీ చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారు. కాంగ్రెస్‌ని పూర్తి స్థాయిలో ముందుండి నడుపుతున్నారు. భారత్ జోడో యాత్ర తరవాత ఆయనలో మార్పు కనిపిస్తోంది. ఎక్కువగా ప్రజల్లోకి వెళ్తున్నారు. వాళ్ల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. పార్టీలోని సీనియర్ నేతలంతా రాహుల్ కనుసన్నల్లోనే నడుస్తున్నారు. అంతే కాదు. రానున్న ఎన్నికల బాధ్యత అంతా తీసుకున్నారట రాహుల్. ఈ విషయం కర్ణాటక డిప్యుటీ సీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని రాహుల్ గాంధీయే లీడ్ చేస్తారని ప్రకటించారు. భారత్ జోడో యాత్ర తరవాత రాహుల్‌కి పాపులారిటీ పెరిగిందని స్పష్టం చేశారు. ఈ కారణంగానే బీజేపీలో భయం మొదలైందని అన్నారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ మధ్య యుద్ధం మొదలైంది. బీజేపీ సోషల్ మీడియా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఆ ధాటిని తట్టుకుని మరీ కాంగ్రెస్ కూడా సోషల్ మీడియాలో బీజేపీపై సెటైరికల్ పోస్ట్‌లు పెడుతోంది. ఇటీవల రెండు పార్టీలూ పోస్టర్ వివాదం మొదలైంది. ఇలాంటి తరుణంలో డీకే శివకుమార్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆసక్తికరంగా మారింది. "రాహుల్ గాంధీ పాపులారిటీ పెరుగుతోంది. అందుకే బీజేపీలో భయం మొదలైంది. భారత్ జోడో యాత్ర తరవాత రాహుల్ వైఖరిలో చాలా మార్పు వచ్చింది. ఇప్పటి వరకూ బీజేపీ ఆయనపై చేసిన తప్పుడు ప్రచారం అంతా తలకిందులైంది. ప్రజలంతా ఇప్పుడు ఆయనని లీడర్‌గా గుర్తిస్తున్నారు. ప్రతి అడుగునీ గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే ముందుండి నడిపిస్తారు"ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ట్విటర్‌లో కాంగ్రెస్ ఓ పోస్ట్ పెట్టింది. "అబద్ధాల కోరు" అంటూ మోదీ ఫొటోను షేర్ చేసింది. త్వరలోనే ఎన్నికల ర్యాలీలకు సిద్ధం అంటూ వెల్లడించింది. ఆ తరవాత మరో ఫొటోనీ షేర్ చేసింది. అందులోనూ ప్రధాని మోదీని టార్గెట్ చేసింది. ఇవి బీజేపీయేతర వర్గాల్లోకి బాగానే వెళ్లాయి.దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ ఇదే స్థాయిలో కౌంటర్ ఇచ్చింది. రాహుల్ గాంధీకి పది తలలు అతికించి రావణుడు అంటూ ఓ పోస్ట్ పెట్టింది. ధర్మాన్ని నాశనం చేసే వ్యక్తి, భారత్ వ్యతిరేకి అంటూ స్ట్రాంగ్‌గా రిప్లే ఇచ్చింది. ఇలా రెండు పార్టీల మధ్య పోస్టర్ వార్ మొదలైంది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ తీవ్రంగా స్పందించారు.

# నన్ను ఆశీర్వదించండి..

## నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా..!

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా చర్లపల్లి కార్పొరేటర్ శ్రీమతి బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ముఖ్య అతిథిగా బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే ఆవకాశం ఇచ్చిన కేసీఆర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ఇండస్ట్రీయల్ భూముల్ని కేటీఆర్ సహకారంతో రెసిడెన్షియల్ జోన్ లోకి తీసుకువచ్చానని ఆయన అన్నారు. నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని గత కొంతకాలంగా సీఎం కేసీఆర్ కి విజ్ఞప్తి చేస్తే నిన్ననే మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరికొన్ని రోజుల్లోనే కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతో కూడిన అధునాతన హాస్పిటల్ అందుబాటులోకి రానుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. దీంతో పాటుగా ఉప్పల్ నియోజకవర్గానికి ఒక జూనియర్ కాలేజ్, ఒక డిగ్రీ కాలేజ్ తీసుకొస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఎర్రకుంట చెరువును మోడ్రన్ లేక్ గా మారుస్తానని, స్థానిక ప్రజలకు వాకింగ్ చేసే విధంగా





వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి పలుచోట్ల ఓపన్ జిమ్స్ ఏర్పాటు చేస్తానన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి సహాయాన్ని అందిస్తానని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, స్థానికంగా ఏ సమస్యలు ఉన్నా నేరుగా నాతో చెప్పుకోవచ్చు అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థంగా సేవ చెయ్యాలనే దృక్పథంతో నేను మీ ముందుకు వచ్చానని, మీరు నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి మాజీ చైర్మన్ తాడురి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లురి అంజయ్య, నాయకులు బాల్ రెడ్డి, శివ కుమార్ గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, కనక రాజ్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్, ప్రభు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ధనుంజయ గౌడ్, భాను చందర్, కొల నరేష్, లక్ష్మారెడ్డి, సత్తి రెడ్డి, హరినాథ్, వెంకట్ రెడ్డి, అలీ, దప్పు గిరి, జయకృష్ణ, మహేష్ గౌడ్, జంపాల్ రెడ్డి, సంపత్, పుష్పాలత, సత్తెమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

---

# సంతా మా ఊరి సంతా..

# కాలనీల చెంతకే సంతలు..

**తాజా కూరగాయలు, పండ్లు ఇళ్ల వద్దనే లభ్యం.. సంతల వద్ద సదుపాయాలు కల్పించాలని కోరుతున్న జనం..**

**జయభేరి, మేడ్చల్ :**

సంతా మా ఊరి సంతా వారానికోసారి జోరుగా సాగేటి సంతా మా ఊరి సంతా అని అలనాటి పాట గుర్తుందా... లేకపోతే ఈ వార్త చదివితే గుర్తుకొస్తుంది లే. నేటి తరం వారికి నాటి సంతల గురించి తెలియక పోయిన నేడు మేడ్చల్, గుండ్లపోచంపల్లి పట్టణంలోని కాలనీలు, మండలంలోని గ్రామాల్లో జరిగే సంతాలను చూస్తే తెలుస్తుంది.ఒకప్పుడు కూరగాయలు, పండ్లు, ఇతర సామాగ్రి కోసం కిలోమీటర్ల దూరంలో ఉండే మార్కెట్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు తీరు మారింది. కాలనీవాసుల ఇక్కట్లను దూరం చేసేందుకు వ్యాపారులే తాజా కూరగాయలు, ఆకుకూరలు, సీజనల్ పండ్లు, ఇతర సామాగ్రిని వారి చెంతకే తీసుకువస్తున్నారు. దీంతో పట్టణ వాసులు తమ ఇండ్ల వద్దనే తాజా కూరగాయలతో పాటు అన్ని వస్తువులు లభ్యమవుతుండగా విక్రయదారులకు మంచి గిరాకీ ఉంటోంది. మేడ్చల్ పరిధిలోని అన్ని కాలనీలలో ఒక్కో రోజు ఒక్కో కాలనీ వద్ద, మండలంలోని గ్రామాల్లో ఒక్కో రోజు ఒక్కో గ్రామంలో సాయంత్రం సమయాల్లో వ్యాపారులు ఈ సంతలు ఏర్పాటు చేస్తున్నారు.

**ఒక్కో రోజు ఒక్కో కాలనీలో...**

మేడ్చల్ పరిధిలో సోమవారం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా గ్రంథాలయం సమీపంలో, రైల్వే స్టేషన్ రోడ్డులో, మంగళవారం ఉమానగర్ కాలనీలో, బుధవారం ఎన్జీవోస్ కాలనీ, గురువారం వెంకట్రామయ్యకాలనీ,ఎస్టీ హాస్టల్ వద్ద,శుక్రవారం కిష్టాపూర్, శనివారం ఆత్వెల్లి, హౌసింగ్బోర్డు కాలనీ, ఆదివారం



బాలాజీనగర్ కాలనీల వద్ద సంతలు ఏర్పాటు చేస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం కండ్లకోయలో, శనివారం లక్ష్మీనగర్ కాలనిలో నిర్వహిస్తున్నారు.

**మండలంలోని గ్రామాలలో..**

సోమవారం డబిల్ పూర్ గ్రామంలో,మంగళవారం రావల్ కోల్, బుధవారం మునిరాబాద్, గురువారం పూడూర్, శుక్రవారం శ్రీరంగవరం, శనివారం తదితర గ్రామాలలో సాయంత్రం 5గంటల నుండి రాత్రి 10గంటల వరకు సంతలు సాగుతున్నాయి. గతంలో కూరగాయలు తెచ్చుకోవాలంటే పట్టణ పరిధిలోని పలు కాలనీల వారు కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడ్చల్ మార్కెట్ రావాల్సి ఉండేది. దీంతో మహిళలు కిలోమీటర్ల మేర నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మండలంలోని గ్రామాల వారు సైతం మేడ్చలు వెళ్లేవారు. అయితే కొంత కాలంగా కూరగాయ వర్తకులే కాలనీవాసుల చెంతకు వచ్చి సంతను ఏర్పాటు చేసి తాజా కూరగాయలు, పండ్లు, ఇతర సామాగ్రి విక్రయిస్తున్నారు. వారానికి ఒక రోజు సంత సాగుతుండడం, ఒకే చోట అన్ని రకాల నిత్యవసరాలు, ఇతర వస్తువులు లభ్యమవుతుండడంతో ఆయా కాలనీల ప్రజలు,గ్రామాల్లో ప్రజలు భారీగా సంతలకు చేరుకుని తమకు కావల్సిన నిత్యవసరాలు,ఇతర వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

**సంతల వద్ద సదుపాయాలు కల్పించాలని కోరుతున్న జనం**

కాలనీల చెంత సంతలు సాగడం సంతోషకరంగా ఉన్న వసతుల లేమితో ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలనీల్లో సంతలు క్రయవిక్రయదారులతో జోరుగా సాగుతున్నాయి. సంతలకు వచ్చే వరకు తమకు కావల్సిన వస్తువులను కొనే పనిలో, విక్రయదారులు విక్రయించే బిజీలో ఉంటుండడంతో చిల్లర దొంగలు సంతలను అదునుగా చేసుకుని సంతలకు వచ్చే వారి సెల్ఫోన్లు, పర్సులోని డబ్బులు దొంగిలించుకుపోతున్నారు. ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. దీంతో సంతల వద్ద పోలీసులు నిఘా పెట్టాలని, సంతలు జరిగే అన్ని కాలనీలలో పారిశుద్యం, చెత్త తొలగింపు వంటి వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



**ఒకే చోట అన్ని దొరుకుతున్నాయి**

**- అరుణ (గుండ్లపోచంపల్లి)**

సంతలు ఏర్పాటు చేయడం వల్ల తమకు కూరగాయలు, ఇతర వస్తువులన్నీ ఒకే చోట దొరుకుతున్నాయి. సంతలు లేనప్పుడు కూరగాయల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. వ్యాపారులే తమ కాలనీల్లో సంతలు ఏర్పాటు చేస్తుడడంతో ఇళ్ల వద్దే అన్ని వస్తువులు లభ్యమవుతున్నాయి. సంతలకు వచ్చే వారు దొంగల బారిన పడకుండా పోలీసులు సంతల వద్ద నిఘా పెట్టాలి.

**వీధుల్లో తిరిగే పని తప్పింది**

**- కూరగాయల వ్యాపారి**

వ్యాపారులమంతా ఒకే చోట సంతను ఏర్పాటు చేయడం వల్ల తమకు వీధుల్లో తిరిగే పని తప్పింది. అంతకు ముందు తాము నిత్యం తోపుడు బండ్లతో వీధి వీధి తిరిగి కూరగాయలు అమ్ముకునే వాళ్లం. ప్రస్తుతం రోజుకో కాలనీలో ఒకే చోట కూర్చొని తమ వ్యాపారం చేసుకుంటున్నాం. నేరుగా పొలంలో పండించిన కూరగాయలు అమ్మడంతో రైతులకు గిట్టుబాటు అవుతుంది. కొనుగోలుదారులు తాజా కూరగాయలు మార్కెట్ ధర కంటే తక్కువకే లభ్యమవుతున్నాయి.



---



# ప్రజావాణి కార్యక్రమం రద్దు

## జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

**జయభేరి, శామీర్ పేట్, అక్టోబర్ 7 :**

ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం (ఈనెల 9న) తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించనున్నందున సోమవారం జరిగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు దూర ప్రాంతాల నుంచి అవస్తలు పడి ప్రజావాణికి తరలి రావద్దని, అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు ఉన్నందున ప్రజలు సహకరించాలని కలెక్టర్ అమోయ్ కుమార్ కోరారు.

# కులవృత్తులకు ఆర్థిక చేయూత

**లబ్ధిదారులకు బిసిబంధు చెక్కులను అందజేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి**

**జయభేరి, మేడ్చల్ :**



కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు సీఎం కేసీఆర్ చేయూతను అందిస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వం బిసి కులవృత్తులను ప్రోత్సహిస్తూ అందిస్తున్న రూ.1 లక్ష రూపాయల బిసి బంధు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు కులవృత్తులను పట్టించుకోలేదని స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా అనేక పథకాలతో భరోసా కలిపిస్తున్నారని తొమిది ఏళ్లలో కనీవినీ ఎరుగని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలతో సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని కరోనా మహమ్మారితో దేశం ఆర్థికంగా నష్టపోతున్నా తెలంగాణలో సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత కేసీఆర్ కు దాక్కుంతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బిసి బంధు రుణలతో లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతిఒక్కరూ డబ్బును వృధా చేయకుండా చేసే పనిలో కష్టపడి జీవితాల్లో ఉన్నత స్థాయికి రావాలని కోరారు. బిసి బంధు పథకం నిరంతర ప్రక్రియ అని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్దికోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక రాద్ధాంతం చేస్తున్నాయని వాటిని ప్రజలు పట్టించుకోవదన్నారు. తెలంగాణ రాష్టం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కు ప్రజలందరూ మద్దతుగా నిలబడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం హేమంత్ రెడ్డి, అమరం జైపాల్ రెడ్డి, భేరి బాలరాజు, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కార్యదర్శి సొంగరి సత్తిరెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---



# ఆపదలో ఉన్న వారికీ బిఎల్ఆర్ ఆర్థిక సహాయం

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గం చర్చి కాలనీ పదో డివిజన్లో బీఆర్ఎస్ కార్యకర్త పాసాల జ్యోతి భర్త రాయప్ప కు యాక్సిడెంట్ జరిగిన విషయం తెలుసుకొని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్న వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి పాసాల జ్యోతి భర్త రాయప్ప కు బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆకుల మహేందర్ చేతుల మీదుగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించినారు. ఈ కార్యక్రమంలో మధుకర్ రెడ్డి, చెన్నారావు, నాగేశ్వరరావు, పద్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---



# మరణించిన మృతుడి కుటుంబానికి బిఎల్ఆర్ ఆర్థిక సహాయం

**జయభేరి, ఉప్పల్ :**

రామంతపూర్ డివిజన్ రాజేంద్రనగర్ కాలనీకి చెందిన జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికురాలు నాగలక్ష్మి జాన్సన్ కుమారుడు డేవిడ్ రాజు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు డేవిడ్ రాజు కుటుంబానికి బండారి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించిన బీఆర్ఎస్ నాయకులు టోనీ, స్థానిక వాసులు నమ్మాల శీను, రుద్రాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

---



ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపు నెంబర్ 3లో గుండెపోటుతో మరణించిన ఎండీ. దావూద్ కుటుంబానికి ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు BLR చారిటబుల్ ట్రస్ట్ నుండి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ Dr. BV చారి, శంకర్, ఉపేందర్ యాకంత్, రవిందర్ రెడ్డి, రవి, హరీష్, శ్రీను కాలనీ వాసులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**


---



మీర్ పేట్ HB కాలనీ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన కాంత ప్రసాద్ వర్మ అనారోగ్యంతో అకాల మరణం చెందినందున వారి స్వగ్రామం ఉత్తరప్రదేశ్ లోని లక్నో ప్రాంతానికి తీసుకు వెళ్లడానికి డబ్బులు లేనందున స్థానిక యువజన నాయకులు టిల్లు ముదిరాజ్ వారి పరిస్థితిని మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య కి వివరించగా, గొల్లూరి అంజయ్య వెంటనే ఉప్పల్ నియోజకవర్గం BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ని సంప్రదించి వారి కుటుంబ పరిస్థితిని వివరించడం జరిగింది. బండారి లక్ష్మారెడ్డి స్పందించి వారి కుటుంబానికి ప్రయాణ ఖర్చులకోసం రూ. 10,000 అందజేసి ఆర్థిక సహాయం చేయడం జరిగింది.

**జయభేరి, కాప్రా**

---




# ఎమ్మార్సీఈ కళాశాలలో వర్క్ షాప్

**జయభేరి, మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో శనివారం ఫ్రెష్ మెన్ ఇండక్షన్ పై వర్క్ షాప్ నిర్వహించారు. కోడింగ్ నింజాస్ సహకారంతో చేపట్టిన వర్క్ షాప్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇండస్ట్రీఇన్సిట్యూషన్ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ఇలాంటి వర్క్ షాప్ లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మైక్రోసాఫ్ట్,సాఫ్ట్వేర్ ఇంజనీర్ సాక్షి శర్మ కంప్యూటర్ రంగంలో వచ్చిన నూతన ఆవిష్కరణలను వివరించారు. కార్యక్రమంలో డీన్ నర్సింహ్మారెడ్డి, రాజేశ్వరన్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి



## ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావు

**జయభేరి, తూంకుంట, అక్టోబర్ 7 :**

తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ కారంగుల రాజేశ్వర్ రావు అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలో 8 మందికి మంజూరీ అయిన కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తు ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాడని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ యాదవ్, మేనేజర్ శ్రావణ్ కుమార్, నర్సింగ్ రావు, కృష్ణారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## మంత్రి ని కలిసిన సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ లాల్ సింగ్

**జయభేరి, అక్టోబర్7:**

రుణమాఫీ కానీ రైతుల గురించి మంత్రిని కలిసిన సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ పెండింగ్ లో ఉన్న రైతుల రుణమాఫీలను కోసం బోయిన్పల్లి లోని క్యాంపు కార్యాలయంలోశామిర్ పేట్ బిఆర్ఎస్ జిల్లా నాయకుడు తాళ్ల జగదీష్ గౌడ్ తో కలిసి మంత్రి మల్లారెడ్డిని కలిసి వివరించారు. విషయం గ్రహించిన మంత్రి మల్లారెడ్డి సానుకూలంగా స్పందించారు.



## మంత్రి పర్యటన ను జయప్రదం చేయాలి

### పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, అక్టోబర్ 7 :-**

ఉమ్మడి శామీర్ పేట్ మండల పరిధిలోని తూముకుంట మున్సిపాలిటీ, ఉప్పర్ పల్లి, ఉద్దెమర్రి, కేశవ పూర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనల, ప్రారంభోత్సవాలకు నేడు (ఆదివారం) రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లా రెడ్డి రనున్నారని తూముకుంట మున్సిపాలిటీ బీ ఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బీఆర్ ఎస్ నాయకులు, గ్రామస్తులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 23న దసరా సెలవు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**జయభేరి, హైదరాబాద్ అక్టోబర్ 7**

దసరా సెలవును ప్రభుత్వం మార్పు చేసింది. ఈ నెల 23వ తేదీన దసరా సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 24న సైతం సెలవును ఇచ్చింది. ఈ క్రమంలో తెలంగాణ విద్వత్ సభ ఈ నెల 23న దసరా పండుగను నిర్వహించుకోవాలని సూచించింది. ఇంతకు ప్రకటించిన సెలవును సైతం కొనసాగింది. పాఠశాల విద్యార్థులకు సెలవులతో పాటు, మిగతా వారికి అక్టోబర్ 23, 24 తేదీల్లో దసరా సెలవులు ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. బతుకమ్మ ప్రారంభ రోజును అక్టోబర్ 14న సాధారణ సెలవు ఇవ్వగా.. దుర్గాష్టమి అక్టోబర్ 22న ఐచ్ఛిక సెలవు ఇచ్చింది.పండుగ నేపథ్యంలో పాఠశాలలకు దాదాపు 13 రోజులు పాటు సెలవులు ఇవ్వగా.. జూనియర్ కళాశాలలకు కళాశాలలకు ఏడు రోజులు సెలవులు ఉండనున్నాయి. జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 19 నుంచి 25 వరకు సెలవులు కొనసాగనుండగా.. 26న తెరచుకోనున్నాయి. జూనియర్ కాలేజీలకు దసరా సెలవుల్లో ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

## త్వరలోనే మీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి... కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగయత్ లేఔట్ లో నివసిస్తున్న అపార్ట్మెంట్ వాసులు అదేవిధంగా ఇండిపెండెంట్ ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పైన భగయత్ లో ఉన్నటువంటి మహాలక్ష్మీ అపార్ట్మెంట్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగయత్ లో ఉన్నటువంటి పలు సమస్యలను లక్ష్మారెడ్డి కి విన్నవించుకున్నారు. లక్ష్మారెడ్డి స్పందిస్తూ త్వరలోనే మీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒక్కంటి శ్రీనివాసరావు, ప్రదీప్, ధీరజ్, శేఖర్ రెడ్డి, సంగమేశ్వర రావు, వనం రంగయ్య, నవీన్ బొమ్మల సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవ్, ప్రసాద్, వినయ్ సాగర్, రవీందర్, బండి రాజు, పి అశోక్, సిహెచ్ నరసింహారెడ్డి, రాజేష్, పవన్, సుధాకర్ రెడ్డి, నరేందర్, అదేవిధంగా పలు అపార్ట్మెంట్స్ అధ్యక్షులు, కార్యదర్శులు అదేవిధంగా భగయత్ లేఅవుట్ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సకలజనులకు అండగా సంక్షేమ పథకాలు

### కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**



కులవృత్తులకు జీవం పోయడంతో పాటుగా ప్రతి కార్మికుడు కార్మికుడిగా మిగిలి పోకుండా యజమాని కావాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ నిరుపేద కుటుంబాలకు బీసీ బంధు పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల లబ్ధి దారులకు మంత్రి మల్లారెడ్డి బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... డబిల్ పూర్ గ్రామానికి 9, గౌడవెల్లి గ్రామానికి 7, పూడూర్ గ్రామానికి 3, శ్రీరంగవరం గ్రామానికి 12 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అందజేస్తున్న బీసీ బంధు కులవృత్తులకు జీవం పోసినట్లు అవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ ఛైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీ శైలజ విజయానంద రెడ్డి, మేడ్చల్ జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు విజయానందారెడ్డి, మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేఖర్ గౌడ్, మేడ్చల్ పీఏసీఎస్ ఛైర్మన్ రణదీప్ రెడ్డి, గౌడవెల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు గోమారం శ్రీనివాస్ రెడ్డి, పూడూరు సర్పంచ్ బాబు యాదవ్, గౌడవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి, డబిల్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, భాగ్యరెడ్డి, సింహాలు యాదవ్, వీగపతి, సదానంద్ గౌడ్, విఘ్నేశ్వర్ యాదవ్, శివ మలిగ తదితరులు పాల్గొన్నారు.

## జనసేనా పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను

### కాకుమాను లక్ష్మణ్ రావు

**జయభేరి, శామిర్ పేట్, అక్టోబర్7:**



జనసేనా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేస్తామని మేడ్చల్ నియోజకవర్గ జనసేనా పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కాకుమాను లక్ష్మణ్ రావు అన్నారు. శనివారం శామీర్ పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో మేడ్చల్ నియోజకవర్గ జనసేనా పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కాకుమాను లక్ష్మణ్ రావు జనసేనా పార్టీ జెండా ఎగురవేసి జనసేనా బస్తీబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికి, షాపుకి తిరుగుతూ జనసేనా బస్తీ బాట కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ససందర్భంగా కాకుమాను లక్ష్మణ్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జనసేనా పార్టీ బలోపేతానికి ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాడుతానన్నారు. ప్రజలు వేసే ఓటు ఆలోచించి మీ అమూల్యమైన ఓటును వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వీరమహిళా అధ్యక్షురాలు, సనత్ నగర్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కావ్య, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జనసేనా పార్టీ ఇంచార్జీ సతీష్, శామీర్ పేట్ మండల జనసేనా పార్టీ నాయకులు ఇబ్రహీం, జనసేనా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం : సర్పంచ్ జాము రవి

**జయభేరి, అక్టోబర్7 :**



గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని సర్పంచ్ జాము రవి అన్నారు. మూడుచింతలపల్లి గ్రామంలో శనివారం రూ.4 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి మల్లారెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రత్యేక నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచ్ బాలరాజ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నీరజ్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## బీసీ బంధుతో కుల వృత్తులకు ప్రోత్సాహం

### - మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ మహేందర్ రెడ్డి

**జయభేరి, అక్టోబర్ 7:**



తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అందజేస్తున్న బీసీ బంధు కులవృత్తులకు జీవం పోసినట్లు అవుతుందని మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. శామీర్ పేట్ మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు చామకూర మహేందర్ రెడ్డి శనివారం బీసీ బంధు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కులవృత్తులకు జీవం పోయడంతో పాటుగా ప్రతి కార్మికుడు కార్మికుడిగా మిగిలి పోకుండా యజమాని కావాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ నిరుపేద కుటుంబాలకు బీసీ బంధు పథకం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. విశ్రాంతి అనేది లేకుండా మేడ్చల్ నియోజకవర్గంలో పర్యటిస్తూ అభివృద్ధి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న కార్మికశాఖ మంత్రి మరోసారి మేడ్చల్ నుండి ఎమ్మెల్యే కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విలసాగరం సుదర్శన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోనీ భాయ్, వార్డు సభ్యులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**జయభేరి, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్ సమీపంలోనీ శ్రీ కొండపోచమ్మ ఆలయ హుండీని శనివారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు ఈవో మోహన్ రెడ్డి సర్పంచ్ రజిత రమేష్ చైర్మన్ జమ్మల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ భక్తులు సమర్పించిన నగదు 3 నెలల 20 రోజుల హుండీ ఆదాయం 7,95,105 రూపాయలు వచ్చినాయని అన్నారు. అలాగే వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కోసం ఈ ఆదాయాన్ని ఖర్చు చేయడం జరుగుతుందని అమ్మవారి భక్తులకు ఇబ్బంది కలగకుండా వసతులను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, కనకయ్య, హరిబాబు, లక్ష్మణ్, రమేష్, యాదగిరి, కొండయ్య, లక్ష్మణ్, గోవర్ధన్, తిరుపతి, ఐలయ్య, కృష్ణమూర్తి, మల్లయ్య, చిన్న, సంజీవులు, శ్రీను సుధాకర్, చందు అంజయ్య, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విజృంభిస్తున్న డెంగ్యూ జ్వరం ప్రజలు తస్మాత్ జాగ్రత్త

**జయభేరి, మెదక్**

మెదక్ జిల్లా రామాయంపేట మండలంతో విజృంభిస్తున్న విష జ్వరాలు ఉమ్మడి మండలలా నుండి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజు 300 నుండి 400 మంది రోగులు డెంగ్యూ మలేరియా జ్వరాలతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారని ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ మణికంఠ తెలిపారు.వారు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా జ్వరాల కేసులు పెరుగుతున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు దోమల భారీ నుండి అప్రమతంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## వరుస భూకంపాలతో దద్దరిల్లిన అఫ్ఘానిస్థాన్.. 14 మంది మృతి

**జయభేరి, న్యూ డిల్లీ అక్టోబర్ 7**

పొరుగు దేశం అఫ్ఘానిస్థాన్ వరుస భూకంపాలతో దద్దరిల్లింది. శనివారం మధ్యాహ్నం అరగంట వ్యవధిలో ఏకంగా మూడు భారీ భూకంపాలు సంభవించాయి. రిక్టరు స్కేలుపై 6.1, 5.9, 6.2 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూప్రకంపనల ధాటికి పలు చోట్ల భవనాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 78 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.కాగా, ముందుగా శనివారం మధ్యాహ్నం 12:11 గంటలకు తొలి భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.1 గా నమోదైంది. తుర్క్‌మెనిస్థాన్‌లోని అస్గాబట్ నగరానికి ఆగ్నేయంగా 471 కిలో మీటర్ల దూరంలో సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది.ఆ తర్వాత 8 నిమిషాలకే అంటే 12:19 నిమిషాలకు మరోసారి భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రత 5.9గా నమోదైంది. ఆ తర్వాత 23 నిమిషాల వ్యవధి తర్వాత అంటే 12:42 గంటలకు మరోసారి భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది. అస్గాబట్ నగరానికి ఆగ్నేయంగా 428 కిలోమీటర్ల దూరంలో సముద్ర మట్టానికి 34 కిలోమీటర్ల లోతుతో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## ఘర్షణకు దారి తీసిన పహిల్వాల్ల వాగ్వాదం

**జయభేరి, హైదరాబాద్**

ఎల్బీ స్టేడియంలో రెండు వర్గాలు ఘోరంగా కొట్టుకున్నారు. ఇది చూసిన ప్రేక్షకులు పరుగులు పెట్టారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన మోదీ కేసరి దంగల్ (కుస్తీ) పోటీల్లో వివాదం చెలరేగింది. ఓ పక్క మ్యాచ్ జరుగుతుండగా.. ఇద్దరు పహిల్వాన్ల మధ్య వాగ్వాదం జరిగి, పరస్పరం దాడులు చేసుకున్నారు. కుర్చీలతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకోగా.. పలువురికి గాయాలయ్యాయి. పహిల్వాన్ల దాడులతో భయాందోళనకు గురైన ప్రేక్షకులు స్టేడియం నుంచి బయటకు పరుగులు తీశారు. పోలీసులు ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు.



## మతి స్థిమితం లేని బాలుని అదృశ్యం

### - 14 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగింత

**జయభేరి, మేడిపల్లి :**

కన్నకడుపు తీపి ఒక వైపు, కన్న బిడ్డల ఆకలి బాద మరోవైపు... రెండింటి మధ్య ఆ తల్లిదండ్రులు రెండో దానివైపే మొగ్గు చూపారు ఎందుకంటే బిడ్డలు ఎలా ఉన్న కాలానికి కడుపుకు ఆకలి బాద తెలియదు కదా... శుక్రవారం మధ్యాహ్నం మతి స్థిమితం సరిగా లేని బాలుణ్ణి ఇంటి వద్ద ఉండమని... ఆ తల్లిదండ్రులు రోజువారీ పనులకు వెళ్ళడం జరిగింది. మంచి చెడూ తెలియని ఆ పసి మనసు బయకువెల్లిపోయాడు.. ఎటు వెళ్ళాడో తెలియదు, తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సరికి బాలుడు కనిపించకపోయే సరికి ఏం చేయాలో తెలియని స్థితిలో ఆపదలో మొదట గుర్తొచ్చే పోలీస్ వారి వద్దకు రాగానే, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి.. నిరంతరం సీసీ టీవీలను పరిశీలించి బాలుడు ఉప్పల్ వైపు వెల్లినట్లు గుర్తించి, వెతికి బాలుడిని తెచ్చి తల్లిదండ్రులకు అప్పగించగా.. ఒక్కసారి ఆ తల్లిదండ్రుల కండల్లో ఆనందం వర్ణానాతీతం. తొందరగా తమ బాలుణ్ణి వెతికి తెచ్చినందుకు మేడిపల్లి పోలీస్ లకు ఆ తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేయడం జరిగింది.

జయభేరి సినిమా

# ఇటలీలో పెళ్లి వేడుక

యువ హీరో వరుణ్‌తేజ్, కథానాయిక లావణ్య త్రిపాఠి పెళ్లి వేడుకలు శుక్రవారం హైదరాబాద్‌లో మొదలయ్యాయి. జూన్ 9వ తేదీన ఈ జంటకు నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. త్వరలో వారు పెళ్లిపీటలెక్కబోతున్నారు. ఈ నేపథ్యంలో చిరంజీవి నివాసంలో ప్రీ వెడ్డింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో చిరంజీవి కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫొటోలను చిరంజీవి తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. ఇటలీలోని టస్కానీ పెళ్లికి వేదిక కానుందని, మెగా హీరోలందరూ ఓ వారం పాటు షూటింగ్‌లకు బ్రేక్ తీసుకొని వివాహ వేడుకలో పాల్గొనబోతున్నారని తెలిసింది.





## కల నిజం చేసుకుంది..


సినిమాల్లోకి రాకముందే ఆమె ఫేమస్. గమకాలకు కొత్త గమనం నేర్పింది. సంగతులతో బంతాట ఆడుకుంది. తన 'పాట'వానికి యూట్యూబ్‌ను వేదికగా ఎంచుకుంది. తన గానామృతంతో యూట్యూబ్ వీక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఆ మధుర గాయని పేరు నూపుర్ సనన్. సామాజిక మాధ్యమాల్లో సెలెబ్రిటీ హోదా దక్కించుకున్న ఆమె నటిగా బాలీవుడ్‌లో పాగా వేసింది. ఇప్పుడు రవితేజ హీరోగా వస్తున్న 'టైగర్ నాగేశ్వరరావు' ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించనుంది. "ప్రేమను వర్ణించడానికి మాటలు సరిపోవు.. అని భారీ భారీ డైలాగులు చెబుతుంటారు. అసలు నిర్వచనమంటూ ఉంటే కదా ప్రేమ గురించి చెప్పడానికి? నా కాలేజీ రోజుల్లో ఇదే ప్రేమ పేరుతో ఒకడు చీటింగ్ చేశాడు. అతనికి సరైన బుద్ధి చెప్పాను. అప్పటినుంచి ప్రేమ మీద నాకు నమ్మకం పోయింది' అంటూ ఘాటుగా స్పందిస్తుంది నూపుర్. "అందంగా ఉన్నావంటూ చాలామంది పొగుడుతుంటారు. అలా అనిపించుకోవడం గర్వంగా ఉంటుంది. కానీ, బాహ్య సౌందర్యానికే ప్రాధాన్యం ఇస్తూ చేసే కామెంట్లు మనసును తాకవు. ఏదో పొగిడారు కాబట్టి ఆ క్షణం నవ్వుతూ స్పందిస్తా! కానీ, మానసిక సౌందర్యమే ప్రధానమైనది. దాన్ని అర్థం చేసుకున్నవాళ్లు ప్రత్యేకంగా కితాబు ఇచ్చి మన ప్రతిస్పందన ఆశించరు" అంటుంది నూపుర్.

# మంత్ ఆఫ్ మధు సరికొత్త ఆనందాన్ని ఇచ్చింది

నవీన్ చంద్ర, స్వాతిరెడ్డి ప్రధాన పాత్రలలో నటించిన న్యూ ఏజ్ లైఫ్ డ్రామా 'మంత్ ఆఫ్ మధు". భానుమతి & రామకృష్ణ ఫేమ్ శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో, యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్‌పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై నిర్మించారు. అక్టోబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వైపుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ తో మంచి విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ నేపధ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ ని నిర్వహించారు. సక్సెస్ మీట్ లో హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. 'మంత్ ఆఫ్ మధు'కు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన అద్భుతంగా వుంది. చాలా మంచి రివ్యూస్ వస్తున్నాయి. ప్రతి ఒక్కరూ క్రాఫ్ట్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. మధు పాత్రకు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. థియేటర్స్ విజిట్ చేసినప్పుడు ప్రేక్షకులు దగ్గరికి వచ్చి హత్తుకున్నారు. ఇప్పటివరకూ సినిమాని చూసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమా చూసిన ప్రేక్షకులు వర్డ్ ఆఫ్ మౌత్ స్ప్రెడ్ చేయాలని కోరుతున్నాను. తమిళ్ మలయాళంలోనే ఇలాంటి సినిమాలు వస్తున్నాయి.. తెలుగులో రావడం లేదనేవారికి సమాధానంగా మంత్ ఆఫ్ మధు వచ్చింది. చాలా నిజాయితీగా ప్రయత్నించిన సినిమా ఇది. చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇంకా మీ ఆదరణ కావాలి'' అని కోరారు.

స్వాతి రెడ్డి మాట్లాడుతూ.. మధు, లేఖ పాత్రలు ప్రేక్షకుల మనసుని హత్తుకున్నాయి. ఒక లైఫ్ డ్రామాని కొత్తగా ప్రజెంట్ చేసే ప్రయత్నం ఈ చిత్రంతో చేశాం. సినిమా చూసిన చాలా మంది ప్రేక్షకులకు ఇది నచ్చింది. మంత్ ఆఫ్ మధులో చేసిన లేఖా పాత్ర గురించి నేను గర్వంగా చెప్పుకుంటాను. నా కెరీర్ లో సుబ్రమణ్యపురం, అష్టా చెమ్మా చిత్రాలు సాధారణంగా మొదలై అద్భుతమై విజయాలు సాధించాయి. మంత్ ఆఫ్ మధు కూడా అలానే గొప్ప విజయం సాధిస్తుంది'' అన్నారు. దర్శకుడు శ్రీకాంత్ నాగోతి మాట్లాడుతూ.. 'మంత్ ఆఫ్ మధు"కి వస్తున్న రెస్పాన్స్ బాగుంది. సినిమా చూసిన ప్రేక్షకులు చాలా పాజిటివ్ గా సినిమా గురించి చెబుతున్నారు. లిమిటెడ్ స్క్రీన్ లో సినిమాని విడుదల చేశాం. చాలా మంది సినిమాని చూడాలని అడుగుతున్నారు. వారందరి దగ్గరకి సినిమాని తీసుకెళ్ళే ఏర్పాట్లు చేస్తున్నాం. చాలా మంచి రివ్యూస్ వస్తునాయి. ఇందులో ప్రతి సీన్ కి ఒక లాజిక్ వుంటుంది. ప్రతి రంగం ముందుకు వెళుతున్నపుడు సినిమాని కూడా ముందుకు తీసుకువెళ్ళాలి. కథ చెప్పడంలో న్యూ ఏజ్ స్టొరీ టెల్లింగ్ ఏమిటనేది మేమూ ప్రయత్నిస్తున్నాం. అందులో భాగంగానే మంత్ ఆఫ్ మధు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. సినిమా చూసిన ప్రేక్షకులు చాలా మంది కొత్తగా ఫీలౌతున్నారు. కథ చెప్పడంలో కొత్త ప్రయత్నం చేశామని చెబుతున్నారు. మౌత్ టాక్ తో సినిమా మరింతగా జనాల్లోకి వెళుతుందనే నమ్మకం వుంది. ప్రేక్షకులు కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే ప్రయత్నంలో మంత్ ఆఫ్ మధు తీశాం. సినిమా చూసిన చాలా మంది ఆడియన్స్ కొత్తదనం ఫీలవ్వడం ఆనందాన్ని ఇచ్చింది'' అన్నారు. నిర్మాత యశ్వంత్ ములుకుట్ల మాట్లాడుతూ.. మంత్ ఆఫ్ మధుకి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. యూఎస్ లో కూడా షోస్ హౌస్ ఫుల్ అవుతున్నాయి. మా డిస్ట్రిబ్యూటర్స్ చాలా సపోర్ట్ చేస్తున్నారు. ప్రేక్షకుల నుంచి మరింత ఆదరణ కావాలని కోరుతున్నాం'' అన్నారు.





# భగవంత్ కేసరి

## రాహుల్ సంఘ్వీగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ హీరోగా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్ రో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'భగవంత్ కేసరి' చిత్రంతో నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్టర్ అర్జున్ రాంపాల్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. అర్జున్ రాంపాల్ ని రాహుల్ సంఘ్వీగా టెర్రిఫిక్ లుక్ లో పరిచయం చేస్తూ, మేకర్స్ ఈ రోజు అతని క్యారెక్టర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ లో అర్జున్ రాంపాల్ డిజైనర్ వేర్‌లో సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తున్నప్పటికీ, తన ఇంటెన్స్ లుక్స్ తో భయపెట్టారు. సింహాసనంపై కూర్చున్న అర్జున్ రాంపాల్ రాయల్ వైబ్స్ క్రియేట్ చేశారు. ట్రైలర్‌ను రివీల్ చేసే సమయాన్ని కూడా పోస్టర్ ద్వారా మేకర్స్ ప్రకటించారు. ట్రైలర్ రేపు రాత్రి 8:16 గంటలకు విడుదల అవుతుంది. సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ కథానాయికగా, నటిస్తుండగా శ్రీలీల కీలక పాత్రలో కనిపించనుంది. జాతీయ అవార్డు విన్నర్ అర్జున్ రాంపాల్ ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు.ఈ చిత్రానికి ఎస్ఎస్ థమన్ మ్యూజిక్ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ సి రామ్ ప్రసాద్, ఎడిటర్ తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్. యాక్షన్ పార్ట్‌కి వి వెంకట్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.భగవంత్ కేసరి దసరా కానుకగా అక్టోబర్ 19న విడుదల కానుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com